క్లుప్తంగా

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



తలపడుతున్న కర్నూలు–అనంతపురం జట్లు

కోవెలకుంట్ల: పట్టణంలోని సంస్కృత పాఠశాల క్రీడామైదానంలో శనివారం రాయలసీమ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ప్రారంభించారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి 30 జట్లు పోటీల్లో పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు పెద్దబాబు, మురళీమోహన్ తెలిపారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 15వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 12 వేలు, ఆ తర్వాత వరుసగా రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు చొప్పున ప్రదానం చేస్తామన్నారు.

వాటర్‌గ్రిడ్ పైప్‌లైన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం కింద గ్రామాలకు తాగునీరు అందించే పైప్‌లైన్ నిర్మాణ పనులు, జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం, గోరుమానుకొండ పరిధిలో జరుగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు, జాతీయ రహదారి పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట కమిషనర్ హరిప్రసాద్, మెగా కంపెనీ ప్రతినిధి వాసు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సన్మానం అందుకున్న విద్యార్థుల తల్లులు

ప్యాపిలి: స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం పార్థసారథి మాట్లాడుతూ.. విద్యార్థి భవిష్యత్తును నిర్దేశించేది పాఠశాల స్థాయి విద్య అని తెలిపారు. ఈ దశలో విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 7వ తరగతి విద్యార్థుల తల్లులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రసూల్ బేగం, ఈశ్వరమ్మ, సునీత, సుకన్య, చంద్రకళ, నజీమున్నీసా పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: భర్త, అత్త, మామ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని మండల పరిధిలోని హుసేనాపురం గ్రామానికి చెందిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి వివరాల మేరకు.. హుసేనాపురం గ్రామానికి చెందిన రాధికను ఓర్వకల్లు మండలం మిదివేముల మనోజ్‌కు ఇచ్చి 2022లో వివాహం చేశారు. కొంత కాలంగా భర్త మనోజ్‌తో పాటు మామ శేఖర్, అత్త దస్తగిరమ్మ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని రాధిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ 2025 పథకానికి ఆసక్తి కలిగిన యువత దరఖాస్తు చేసుకోవాలని కార్మికశాఖ అధికారిణి నీలిమ సంధ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు అందజేస్తుందని పేర్కొన్నారు. కంపెనీలో ప్రవేశం పొందిన తర్వాత ప్రతి నెలా కంపెనీ నుంచి రూ.500, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.4,500 ఏడాది పాటు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తయిన తరువాత సర్టిఫికెట్ అందజేస్తారని తెలిపారు. ఇది ఉద్యోగంలో చేరేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక లేబర్ ఆఫీసులో సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

డోన్ టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తన కొడుకు, కోడలు ఇంటిని రాయించుకుని తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గంగిరెడ్డి అనే వృద్ధుడు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. కేఈ మాదన్ననగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఆ కాలనీకి చెందిన మాధవస్వామి కోరారు. అలాగే కాలనీ సమీపంలో కొందరు వంకను ఆక్రమించి నిర్మాణలు చేపట్టడంతో నీరు పోవడం లేదని విన్నవించారు.



డోన్‌లోని ఓ హోటల్‌లో హలీం తయారీ



వాహ్.. హలీం

- రంజాన్‌లో ప్రత్యేక వంటకం
- రుచితో పాటు మంచి పోషక విలువలు
- చిన్న పట్టణాల్లో సైతం హలీంకు ఆదరణ
- ముస్లింలతో పాటు ఇతరులూ తినడానికి ఆసక్తి

డోన్: రంజాన్ మాసంలో ప్రత్యేక వంటకం హలీమే. ఏటా రంజాన్ మాసం వచ్చిందంటే చాలు హలీం ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఒకప్పుడు కేవలం హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వంటకం మెల్లమెల్లగా ఇతర ప్రాంతాలకు విస్తరించింది. ఇప్పుడు డోన్ లాంటి పట్టణాల్లో సైతం హలీం తయారీ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఇది ముస్లింలకే కాదు, చాలా మందికి ఫేవరెట్ డిష్. దీని రుచి చూడాలని కొందరు.. కొత్తగా ట్రై చేసే వారు మరికొందరు.. ఏళ్ల తరబడి సీజన్‌లో దీని రుచిని ఆస్వాదించే వారు ఇంకొందరు.. ఇలా హలీంకు రంజాన్ సీజన్‌లో అందరూ గులాం అయిపోవాల్సిందే.. చికెన్(హరీస్), మటన్(హలీం)లతో చేసే ఈ వంటకాన్ని ఆరగించాలని చాలా మంది ఉవ్విళ్లూరుతుంటారు. రంజాన్ మాసం సందర్భంగా హలీంపై ప్రత్యేక కథనం.

శరీరానికి తగిన శక్తి

ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో తెల్లవారుజాము 4 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సుమారు 14 గంటలకు పైగా ఉపవాస దీక్షలో ఉంటారు. ఆ సమయంలో ఆహారంతో పాటు ఎలాంటి ద్రవ పదార్థాలు తీసుకోరు. ఉపవాస దీక్ష ముగించే సరికి శరీరానికి తగిన శక్తి అవసరమవుతుంది. సాధారణంగా ఉపవాస దీక్ష విరమించిన తర్వాత డ్రై ఫ్రూట్స్‌తో పాటు హలీంకు ప్రాధాన్యమిస్తారు. హలీంలో మంచి పోషక విలువలతో పాటు తేలికగా జీర్ణమయ్యే గుణం ఉండడమే ఇందుకు కారణం. కేవలం సాయంత్రం లభించే హలీం రుచులను ఆస్వాదించడానికి ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. హలీం పుట్టింది అరబ్ దేశాల్లో అయినా ప్రాచుర్యం పొందింది మాత్రం హైదారాబాద్‌నే అని చెప్పుకోవచ్చు. అలాంటి ఈ వంటకం నేడు అన్ని ప్రాంతాలకు విస్తరించింది.

తయారీలోనూ ప్రత్యేకమే

సంప్రదాయక వంటలతో పోలిస్తే హలీం తయారీ ఆద్యంతం ప్రత్యేకమే. దీనికి కనీసం 8 గంటల సమయం పడుతుంది. ఇందులో మటన్ లేదా చికెన్, గోధుమలు, అన్ని పప్పులు, బాస్మతి బియ్యం, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉల్లి, పచ్చిమిర్చి, యాలకులు, దాల్చినచెక్క, మిరియాలు తదితర 18 రకాల మసాలా దినుసులు, కొత్తిమీర, పొదీనా ఆకులు, నూనె, బాదం, పిస్తా, జీడిపప్పు తదితర డ్రైఫ్రూట్స్, ఎండు గులాబీ రేకులు, జాఫ్రాన్, సొంపు, పాలు తదితర వాటిని వినియోగిస్తారు. ముందుగా గిన్నెలో మాంసం, నీటిని కలిపి బాగా ఉడికిస్తారు. తగిన నెయ్యి, డాల్డా తీసుకుని గరమసాలన్నీ వేయించాక.. కడిగిన గోధుమ రవ్వను సమపాళ్లలో నీరు, పాలు వేసి కలుపుతారు. ఆ మిశ్రమాన్ని ఒకే ఉష్ణోగ్రతలో ఉడికిస్తారు. అప్పటికే ఉడికిన మాసం వేసి మిశ్రమాన్ని పెద్ద తెడ్డులాంటి కర్రతో రుబ్బుతూనే ఉంటారు. ఇలా ఉదయం ఎనిమిది గంటలకు మొదలు పెడితే.. సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ ప్రక్రియ సాగుతుంది. ఆ మిశ్రమం అంతా ముద్దగా తయారై హలీంగా మారుతుంది. చికెన్‌తో అయితే మిశ్రమం తయారీకి సమయం తక్కువగా ఉంటుంది. మటన్ అయితే సమయం ఎక్కుగా తీసుకుంటుంది. చికెన్ హలీంను హరీస్ గా పిలుస్తారు. హలీం రుచికే కాదు. ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందులోని పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. ఒక కప్పు హలీంలో 365 క్యాలరీలు, కొవ్వు నుంచి లభించే క్యాలరీలు 150 లభిస్తాయి.

ఎనర్జీ ఫుడ్



రంజాన్ ఉపవాస దీక్షలో పాల్గొనే వారు ప్రత్యేకించి హలీంను ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. శరీరానికి కావాల్సిన పోషక విలువలు హలీంలో ఉన్నందు వల్ల ఉపవాసం ఉన్నా ఎలాంటి నీరసం, నిస్సత్తువ ఉండదు. అందు వల్ల చాలా మంది ముస్లింలు హలీంను రాత్రి పూట ఆహారంగా తీసుకునేందుకు ఇష్టపడతారు.

–రహిమాన్, అరటిపండ్ల వ్యాపారి, డోన్

ఆనవాయితీగా వస్తోంది



ఉపవాస దీక్ష అనంతరం హలీంను ఆహారంగా తీసుకోవడం మా కుటుంబంలో ఆనవాయితీగా వస్తోంది. ఇది మంచి రుచితో పాటు శరీరానికి కావాల్సిన అనేక పోషకాలు ఉండడం వల్ల ఇష్టంగా తింటున్నాం. ఉపవాసం ఉన్నా నీరసంగా లేకుండా రోజువారి కార్యక్రమాలు చేసుకోగలుగుతున్నాం.

–మహబూబ్ బాషా, కొండపేట, డోన్



హలీంను కొనుగోలు చేస్తున్న యువకులు

మైనింగ్ పనుల అడ్డగింత



మాన్యం భూమిలో అక్రమంగా చేస్తున్న మైనింగ్ పనులు

బనగానపల్లె రూరల్: పలుకూరు గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిలో శనివారం అక్రమంగా మైనింగ్ వెలికి తీస్తున్నట్లు తెలియడంతో ఆలయ అర్చకుడు భాస్కరయ్య పనులను అడ్డుకున్నారు. నందివర్గం పోలీసులకు సమాచారం ఇచ్చారు. భాస్కరయ్య సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ఎద్దుల రాజన్న అనే వ్యక్తి శివాలయానికి సంబంధించిన మాన్యంభూమి పక్కనే తనకు మైనింగ్ భూమి ఉందని పేర్కొంటూ భారీ యంత్రాలు, టిప్పర్లను పెట్టి నాపరాయి వెలికితీత పనులు చేపట్టినట్లు తెలిపారు. అయితే మైనింగ్ పనులు ఆలయానికి సంబంధించిన భూమిలో చేయడం జరుగుతోందని ఆరోపించారు. సమాచారం అందుకున్న నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య సిబ్బంది పంపి మైనింగ్ పనులు నిలిపివేయించారు. సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశాకే పనులు చేసుకోవాలని ఆదేశించారు. కాగా మైనింగ్ విషయంపై గ్రూపు టెంపుల్ ఈఓ బ్రహ్మానందరెడ్డి, బనగానపల్లె భూగర్భ గనులశాఖ ఏడీ రాజగోపాల్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు.

తప్పిన ప్రమాదం

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె–సిమెంట్ నగర్ ఘాట్‌లో పెను ప్రమాదం తప్పింది. శనివారం నంద్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బేతంచెర్ల నుంచి నంద్యాలకు వస్తోంది. సిమెంట్ నగర్ ఘాట్‌లో మలుపు వద్ద ట్రాక్టర్, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ క్రమంలో బస్సు కొండ సైడ్‌వాల్‌ను ఢీకొని ఆగింది. సెఫ్టీ వాల్ ఉన్నందున బస్సు నిలిచిందని స్థానికులు తెలిపారు. బస్సులో సుమారు 30 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో తరలించారు.

రాజీయే రాజమార్గం

- లోక్ అదాలత్‌లో 402 కేసులు పరిష్కారం



కోవెలకుంట్ల కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్



బనగానపల్లె: కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి



డోన్: లోక్ అదాలత్‌లో జడ్జిలు తంగమణి, జ్యోతి

కోవెలకుంట్ల: కక్షిదారులకు రాజీయే రాజమార్గమని కోవెలకుంట్ల జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ సూచించారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజీ అయిన 402 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 294 ఎస్టీసీలు, 19 సీసీలు, 76 నేరం ఒప్పుదల కేసులు, ఏడు బ్యాంకు, నాలుగు సివిల్, రెండు చెక్‌బౌన్స్ కేసుల్లో కక్షిదారులు రాజీ అయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌తో త్వరితగతిన న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీపీ వసంత లక్ష్మి, కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తిరుపాలు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి నాగేశ్వ, న్యాయవాదులు వాసగిరి సాయికృష్ణమూర్తి, తిరుపతయ్య, జీఎల్ నరసింహులు, కాశీంసాహెబ్, చంద్రుడు, రమేష్, ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

బనగానపల్లె పరిధిలో 714 కేసులు పరిష్కారం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 714 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. నంద్యాల మేజిస్ట్రేట్ జడ్జి ఎం.ఏసురత్నం ఆధ్వర్యంలో రాజీ మార్గంలో కేసులు పరిష్కారమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: లోక్ అదాలత్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. డోన్ టౌన్, డోన్ రూరల్, బేతంచెర్ల, కృష్ణగిరి, ప్యాపిలి, వెల్దుర్తి, జలదుర్గం, రాచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 581 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే ఎక్సైజ్ 10 కేసుల్లో రూ.61,500, ఈపీ 16 కేసుల్లో రూ.9లక్షలు, ఓఎస్ 6 కేసుల్లో రూ.10 లక్షలు, ఎన్‌ఐయాక్ట్ 4 కేసుల్లో రూ.15 లక్షలతో పాటు ఎంసీ 2 కేసులు, డైవర్స్ 1, పీఎల్‌సీ 10 కేసుల్లో రూ.14,455 పరిష్కరించినట్లు వెల్లడించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

- వివిధ రంగాల్లోని అతివలకు సత్కారం
- పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



డోన్: జెడ్పీ హైస్కూల్‌లో మహిళలకు సత్కారం

డోన్ టౌన్: మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటిపడి ఎదిగినప్పుడే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ చోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా మాట్లాడారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని.. వాటిపై అవగాహన పెంచుకుని అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా పోలీస్‌స్టేషన్, న్యాయస్థానాలను ఆశ్రయించాలని సూచించారు. స్వయం ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి పాల్గొని వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలను ఘనంగా సత్కరించారు. మహిళా సమాఖ్య సంఘం నాయకురాలు షమీమ్ బేగం, సూర్య, పద్మావతి, మాధవిలత, షబానా, లక్ష్మీదేవి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- **బనగానపల్లె రూరల్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ బీవీ రమణ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళాలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కేక్‌కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు.
- **బేతంచెర్ల:** మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ పర్వీన్, వార్డు కౌన్సిలర్లు షేక్ ముబీనా, బుగ్గన సుశీలమ్మ, ఆదిలక్ష్మి, హుసేన్‌బీ, మహేశ్వరి, కుమారి, విజయలక్ష్మితో పాటు నగర పంచాయతీ పారిశుద్ధ్య మహిళా కార్మికులను ఘనంగా సత్కరించారు.
- **కోవెలకుంట్ల:** పట్టణంలోని టౌన్‌బ్యాంకు, మానవతా స్వచ్ఛంద సేవా కార్యాలయాల్లో నిర్వహించిన మహిళా దినోత్సవానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ హాజరయ్యారు. స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమానికి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ వెంకటలక్ష్మి, గాయత్రి విద్యామందిరం కరస్పాండెంట్ కృష్ణప్రియ హాజరై కేక్ కట్ చేశారు.
- **చీరల పంపిణీ**

డోన్ టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెహతాజ్ షోరూం, పద్మశ్రీ టెక్స్‌టైల్స్, సిద్ధూ శారీస్, భువన టెక్స్‌టైల్స్ సహకారంతో పట్టణంలోని నిరుపేదలకు స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు శనివారం చీరలు పంపిణీ చేశారు. లెప్రసీ కాలనీతో పాటు మహిళా కూలీలు, నిరుపేద మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు, సభ్యులు భాస్కర్, చంద్ర, మోహన్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న సేవా సంస్థ సభ్యులు



డోన్‌లో మాట్లాడుతున్న జడ్జి తంగమణి



బనగానపల్లె: ఎంపీడీఓ సమక్షంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు



బేతంచెర్లలో వార్డు కౌన్సిలర్లు, పంచాయతీ సిబ్బంది



కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోలో..

నీటి వృథా.. భవిష్యత్తు వృథ



డాక్టర్ సుందర్‌సింగ్ కాలనీ చర్చి ప్రాంతంలో పైప్‌లైన్ నుంచి లీకేజీ అవుతున్న నీరు



ప్రభుత్వ ఐటీఐలో వృథాగా పారుతున్న నీరు

డోన్: వర్షాభావ పరిస్థితులు, వేసవి మొదలుతో రిజర్వాయర్లు, బోర్లలో నీరు అడుగంటిపోతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇప్పటికే నీటి కొరత వేధిస్తోంది. పరిస్థితి ఇలా ఉంటే డోన్ మున్సిపల్ పరిధిలోని డాక్టర్ సుందర్‌సింగ్ కాలనీ, ప్రభుత్వ ఐటీఐతో పాటు పలు ప్రాంతాల్లో మంచినీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఐటీఐలో తాగునీటి కొళాయి నుంచి నీరు వృథాగా పోతోంది. అలాగే డాక్టర్ సుందర్ సింగ్ కాలనీలోని పలు వీధుల్లో పైపులైన్‌లు దెబ్బతినడంతో పాటు కొళాయిలకు మూతలు లేకపోవడంతో నీరు వృథాగా డ్రైనేజీలో పారుతున్నాయి. అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కానుగల వంకకు నీరు వదలాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న రైతులు

ప్యాపిలి: కానుగల వంకకు నీరు వదలడం ద్వారా సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆదిరెడ్డి, రంగస్వామి, బయ్యపురెడ్డి, రామకృష్ణ యాదవ్ అన్నారు. దయ్యాలమడుగు, డి.రంగాపురం గ్రామాల్లో శనివారం వివిధ గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సహజసిద్ధంగా వెలసిన కానుగల వంకకు నీరు వదలడం ద్వారా 25 గ్రామాల పరిధిలో ఉన్న 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కానుగలవంకలో నీరు లేకపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయన్నారు. బోర్లలో నీరులేక అరటి రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏడాదిలో కనీసం ఒక నెల పాటు ఈ వంకకు నీరు అందించేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

శాస్త్రోక్తంగా హోమ పూజలు



గురుపీఠ విగ్రహం, ధ్వజస్తంభ ఊరేగింపు

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీసెంటర్‌లో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. శనివారం ఆలయంలో రుద్రాభిషేకం, మహాస్నపనం, గణపతి, నవగ్రహ, రుద్ర, దేవి పంచసూక్త లక్ష్మీనారాయణ, సుదర్శన, తదితర హోమాలు నిర్వహించారు. అలాగే పట్టణ శివారులోని పాటమీద ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మహా నవశిర నాగేంద్ర గురుపీఠ, జ్యోతి పరమేశ్వర ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా వేద పండితులు పలు పూజలు నిర్వహించారు. గణపతి హోమం, వాస్తుపూజ, నవగ్రహశాంతి, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, తదితర కార్యక్రమాలు కొనసాగాయి. ఆయా కాలనీలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

దేవదాయ భూములు సిమెంట్ ఫ్యాక్టరీకి ఇవ్వడమేంటి

కొలిమిగుండ్ల: పంటలు పండే దేవదాయశాఖకు చెందిన పొలాలను రైతులు కౌలుకు చేస్తుంటే వాటిని సిమెంట్ ఫ్యాక్టరీలకు ఎలా ఇస్తారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు ప్రశ్నించారు. ఇటీవల కల్వటాలలో వివిధ ఆలయాలకు చెందిన భూములను రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి లీజుకు ఇవ్వడంతో స్థానికంగా ఉండే రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం రైతులు, సీపీఐ నాయకులు దేవదాయ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులు ఎప్పటి నుంచో బహిరంగ వేలం ద్వారా భూములను కౌలుకు దక్కించుకుని పంటలు సాగుచేస్తున్నారని తెలిపారు. అలాంటి పొలాలను సిమెంట్ ఫ్యాక్టరీకి ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రశ్నించిన రైతులను పోలీసుల సాయంతో కేసులు పెడుతామని బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. నియోజకవర్గానికి చెందని మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఈవిషయంపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక రైతులకు న్యాయం జరగకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. రైతులు కామిని ప్రతాప్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి, పెద్దయ్య, నారపురెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు